అధికారమా? ధిక్కారమా?



భువనగిరిలో సన్నాహక సమావేశానికి హాజరైన పట్టభద్రుల ఓటర్లు, బీఆర్ఎస్ శ్రేణులు, సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మొదటిపేజీ తరువాయి...

తప్పుడు మాటలు, తప్పుడు ప్రచారాలు చేస్తుంటే చదువుకున్న వ్యక్తులుగా మాట్లాడకుండా ఉందామా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలను, కాంగ్రెస్ ఇచ్చినట్టు రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్తున్నారని ధ్వజమెత్తారు. 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పడానికి రేవంత్‌రెడ్డికి సిగ్గు ఉండాలని దుయ్యబట్టారు. ఐదు నెలల్లోనే రైతాంగం ఆగమాగమయ్యే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. రుణమాఫీపై కాంగ్రెస్ పూటకోమాట మారుస్తున్నదని మండిపడ్డారు. ఇప్పటికీ రైతుల ధాన్యం కొనటం లేదని, రైతులంతా తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చిందని వెల్లడించారు.

ఆధునిక ఆలయాలను నిర్మించాం

'బీజేపీ వాళ్లు అయోధ్య రామాలయం కట్టామని ఓట్లు అడుగుతున్నరు. యాదగిరిగుట్ట ఆలయాన్ని కేసీఆర్ అద్భుతంగా నిర్మించారు. కానీ గుడి పేరుతో ఓట్లు అడుగలేదు. మేం ఆధునిక ఆలయాలను నిర్మించాం. వాటికి కూడా దేవుడి పేరుపైనే నిర్మించాం' అని కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఓటమికి రెండు కారణాలు ఉన్నాయని, చేసిన పనిని చెప్పుకోలేదని, రెండోది కొన్ని వర్గాలను దూరం చేసుకున్నామని వివరించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మించామని, ఫ్లోరైడ్ రక్కసిని పారదోలామని, దేశంలో ఎక్కడా లేని విధంగా రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని, ఇవన్నీ చెప్పుకోలేకపోయామని పేర్కొన్నారు. ఇక, ప్రధాని మోదీ అన్ని వర్గాలను మోసం చేస్తున్నారని విమర్శించారు. పదేండ్లు ప్రధానిగా ఉండి ఏం చేశారంటే.. పది నిమిషాలు కూడా చెప్పుకోలేని పరిస్థితి అని ఎద్దేవా చేశారు. సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. హామీలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

విద్యార్థులు, నిరుద్యోగులకు 'ఎమ్మెల్సీ' గౌరవ వేతనమిస్తా: రాకేశ్ రెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థి తన ఆస్తులు ప్రభుత్వానికి ఇచ్చానని, రాకేశ్‌రెడ్డి ఏం ఇస్తారని సవాల్ విసురుతున్నారని, తాను ఇవ్వడానికి తన వద్ద ఏం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. గెలిపిస్తే తన గౌరవ వేతనాన్ని పేద విద్యార్థులు, నిరుద్యోగుల కోసం ఖర్చు చేస్తానని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ నిధులనూ నిరుద్యోగుల కోసమే ఖర్చు చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో యాదాద్రి భువనగిరి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, విద్యార్థి నాయకులు గెల్లు శ్రీనివాస్, తుంగ బాలు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు చేతిలో ప్రైవేటు బడి ఫీజు

మొదటిపేజీ తరువాయి...

సెక్రటరీ బుర్రా వెంకటేశం ఇటీవలే మీడియాకు తెలిపారు. ఈ ఏడాది సాధ్యం కాకపోవచ్చని, 2025 -26 నుంచి అమల్లోకి వస్తుందని చెప్పారు. రాష్ట్రంలో 11,051 ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో కొన్ని బడ్జెట్ స్కూళ్లు, కొన్ని కార్పొరేట్ స్కూళ్లు. మొదట ఫీజులు ఖరారు చేయకుండా స్కూళ్లు ఉల్లంఘించినట్టుగా నిరూపించడం సాధ్యంకాదు. ఈ నేపథ్యంలోనే మొదట ఫీజులు ఖరారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. బడుల్లోని వసతులు, ఆదాయ, వ్యయాలను పరిగణనలోకి తీసుకుని ఖరారు చేయనుంది.

మూడేండ్లకొకసారి..

రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ, లా వంటి ప్రొఫెషనల్ కోర్సుల ఫీజులను తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్‌సీ) ఖరారు చేస్తున్నది. హైకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలోని కమిటీ ప్రతి మూడేండ్లకోసారి విద్యాసంస్థల ఆదాయ, వ్యయాలు, ఆడిటింగ్ రిపోర్టులు, వసతులను పరిశీలించి ఫీజుల ఖరారు తర్వాత ప్రభుత్వం ఆమోదిస్తున్నది. ప్రైవేట్ బడుల్లో ఫీజుల ఖరారు కోసం రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఎఫ్ఆర్‌సీని ఏర్పాటు చేయనున్నది. రాష్ట్రంలో వృత్తి విద్యాకాలేజీలు 150లోపే ఉన్నాయి. దీంతో ఫీజుల ఖరారు ప్రక్రియ సులభమవుతున్నది. ప్రైవేట్‌స్కూళ్లు రాష్ట్రంలో 11వేలకు పైగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రస్థాయిలో ఒకే ఎఫ్ఆర్‌సీని ఏర్పాటు చేయడమా? లేక జిల్లాకొకటి ఏర్పాటు చేయాలా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నాలుగు స్లాబ్‌లుగా విభజించి ఫీజులు ఖరారు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నారు.

గతంలో గవర్నింగ్ కౌన్సిల్..

కేసీఆర్ సర్కారు స్కూల్ ఫీజులను ఖరారు చేసే అధికారాన్ని గవర్నింగ్ బాడీకి అప్పగించి స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ఆరుగురు సభ్యులు ఈ బాడీలో ఉంటారని అప్పట్లో స్పష్టం చేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేయాలని ఏడాది కాలంలో విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీ స్ట్రక్చర్‌ను ఖరారు చేస్తుందని అప్పట్లో వెల్లడించింది. ఈ కమిటీలో పాఠశాల కరస్పాండెంట్, పేరెంట్ టీచర్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీచర్ ప్రతినిధి, డీఈవో ప్రతినిధి తల్లిదండ్రుల ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఖరారు చేసిన ఫీజులను వెబ్‌సైట్, నోటీసు బోర్డుల్లో పొందుపరచాలి. ప్రభుత్వం తీసుకునే తాజా నిర్ణయంతో ఈ గవర్నింగ్ కౌన్సిళ్లు రద్దవుతాయి.

> **కార్పొరేట్ స్కూళ్లను కట్టడిచేయండి**
>
> బడ్జెట్ స్కూళ్లను, కార్పొరేట్ స్కూళ్లను ప్రభుత్వం ఒకే గాటన కట్టడం సరికాదు. బడ్జెట్ స్కూళ్లు అతి తక్కువ ఫీజులతో మంచి ఫలితాలు సాధిస్తున్నాయి. బడ్జెట్ స్కూళ్లు తీసుకునే ఫీజులు రూ. 25వేల లోపే. నాలుగు లక్షల మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నాయి. అదే కార్పొరేట్‌లో రూ. 50వేల నుంచి రూ. 4లక్షల వరకు ఫీజుగా తీసుకుంటున్నారు. ఇలాంటి కార్పొరేట్ స్కూళ్లను ప్రభుత్వం కట్టడి చేయాలి. అక్రమాలను నియంత్రించాలి. దోపిడీని అరికట్టాలి. విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బడ్జెట్ స్కూళ్లను కాపాడాలి.
>
> - ఎస్ఎన్ రెడ్డి, ట్రస్మా ప్రధాన కార్యదర్శి

ఆకాశమంత దూరంలో విదేశీ విద్యానిధి!

విద్యార్థులకు తప్పని ఎదురుచూపులు

- ఒక్క సీజన్‌లోనే బీసీ ఓవర్సీస్‌కు 2,665 మంది దరఖాస్తు
- రెండు నెలలు గడచినా పూర్తికాని అర్హుల ఎంపిక
- ప్రభుత్వం నుంచి ఇంకా అందని మార్గదర్శకాలు

హైదరాబాద్, మే19 (నమస్తే తెలంగాణ): విదేశీ విద్యానిధికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం కండ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. దరఖాస్తులు స్వీకరించి, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయి నెలలు గడుస్తున్నా అధికారులు మాత్రం అర్హుల జాబితాను ఇప్పటికీ ప్రకటించలేదు. ఇదేమని అడిగితే ప్రభుత్వం నుంచి కొత్త మార్గదర్శకాలు రావాల్సి ఉందని చెబుతున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

గత ఫాల్ సీజన్‌కు 2665 మంది దరఖాస్తు

పేదింటి బీసీ బిడ్డలు విదేశాల్లో మాస్టర్స్, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల అభ్యాసానికి గత ప్రభుత్వం జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రతీ సంవత్సరం జనవరిలో (ఫాల్ సీజన్) 150 మంది, ఆగస్టులో (స్పింగ్ సీజన్) 150 మందిని మొత్తంగా రెండు సెషన్లకు కలిపి ఏడాదికి 300 మంది నిరుపేద బీసీ విద్యార్థులను ఒక్కొక్కరికి రూ.20లక్షల ఆర్థికసాయాన్ని అందిస్తున్నది. అదేవిధంగా వీసా చార్జీలను, రావడానికైనా లేదంటే పోవడానికైనా సంబంధించి ఎకనామిక్ టికెట్ గరిష్ఠంగా రూ.50వేలను ప్రయాణ ఖర్చులకు అందజేస్తుంది. ఇక జ్యోతిబా పూలే విద్యానిధి పథకంలో మొత్తం సీట్లలో 30 సీట్లను ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు (ఈబీసీ)లకు కేటాయించింది. ఇప్పటివరకు ఈ పథకం కింద దాదాపు 2700 మందికి పైగా వెనకబడిగిన వర్గాలకు చెందిన విద్యార్థులు లబ్ధి పొందారు. కాగా బీసీ ఓవర్సీస్ పథకం కింద గత ఒక్క ఫాల్ సీజన్‌కే 2665 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 2023మంది బీసీ కులాలకు చెందినవారు కాగా, 642 మంది ఈబీసీ కులాలకు చెందిన అభ్యర్థులు ఉన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా ఇప్పటికే పూర్తయింది. వాటిని ఆన్‌లైన్‌లో కూడా ఎన్‌రోల్ చేసినట్టు అధికారులు వివరిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఫాల్ సీజన్‌కు సంబంధించి స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన అర్హుల జాబితాను మాత్రం ప్రభుత్వం ప్రకటించలేదు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన అనంతరం మెరిట్ జాబితాను రూపొందించి దానిని స్టేట్ లెవల్ స్క్రీనింగ్ కమిటీకి పంపాల్సి ఉంటుంది. కమిటీలోని సంబంధిత విభాగం అధికారులతోపాటు, హయ్యర్, టెక్నికల్ ఎడ్యుకేషన్, జేఎన్టీయూకు చెందిన సభ్యులు అర్హులను ఎంపిక చేస్తారు. అయితే అధికారులు ప్రస్తుతం ఫాల్ సీజన్‌కు సంబంధించి మెరిట్ జాబితానే అధికారులు రూపొందించలేదని తెలుస్తున్నది. ఇదిలా ఉంటే ఇప్పటికే స్పింగ్‌సీజన్ కోసం దరఖాస్తులను సైతం స్వీకరించింది. ఆ దరఖాస్తుదారులకు సైతం సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించాల్సి ఉంది.

కొత్త మార్గదర్శకాల కోసమే..

గత బీఆర్ఎస్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం మార్గదర్శకాలను మార్పు చేసేందుకు నూతన కాంగ్రెస్ ప్రభుత్వం సమాయత్తమైనట్టు అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. విదేశాల్లోని అన్ని యూనివర్సిటీలకు కాకుండా కేవలం కొన్నింటికే ఈ పథకాన్ని వర్తింపచేసి, విద్యార్థులకు ఆర్థిక సాయం అందించాలని యోచిస్తున్నదని తెలుస్తున్నది. ఈ మేరకు గతంలోనే ఆదేశాలను జారీ చేసిందని, ఆ మేరకు మార్గదర్శకాలను సిద్ధం చేయాలని సూచించిందని వివరిస్తున్నారు. అధికారులు పన్ను చెల్లింపుదారుల కుటుంబాలకు, కొన్ని నిర్దేశిత టాప్ యూనివర్సిటీల్లో చదివే విద్యార్థులకే పథకాన్ని వర్తింపజేయాలని చూస్తున్నట్టు సమాచారం. ఆ దిశగా అధికారులు ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి నివేదించారని తెలుస్తున్నది. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు వెలువడకపోవడంతోనే విదేశీ విద్యానిధికి అభ్యర్థుల ఎంపిక జాప్యమవుతున్నదని అధికారవర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక సీఎం ఓవర్సీస్, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల పరిస్థితి కూడా దాదాపు ఇలానే ఉన్నది. మరోవైపు విద్యార్థులు మాత్రం స్కాలర్‌షిప్ వస్తుందా? ప్రభుత్వం ఇస్తుందా? లేదా? అని తెలియక తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. తల్లిదండ్రులు కూడా ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే ఏదో నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఇన్‌చార్జిల నియామకం

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): వరంగల్- నల్లగొండ- ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోసం వరంగల్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎన్నికల ఇన్‌చార్జిలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం నియమించారు. ఈ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్, గెలుపు కోసం ప్రత్యేక వ్యూహాలు అమలు చేస్తున్నది. రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఈ స్థానాన్ని బీఆర్ఎస్సే సొంతం చేసుకుంటూ వస్తున్నది. కపిలవాయి దిలీప్‌కుమార్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇద్దరూ రెండేసి సార్లు బీఆర్ఎస్ నుంచి పోటీచేసి ఎమ్మెల్సీలుగా గెలుపొందారు. మొన్నటి దాకా ఈ స్థానం నుంచి ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఇటీవల జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్‌రెడ్డి బరిలో నిలిచారు. తెలంగాణ ఉద్యమం, వామపక్ష భావజాలానికి కేంద్రమైన నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లోని పట్టభద్రులు ఆదినుంచీ బీఆర్ఎస్‌కు అండగా నిలుస్తూ వస్తున్నారు. ఇదే స్ఫూర్తి తో ఎన్నికల్లో విజయం కోసం బీఆర్ఎస్ పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తున్నది. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షులను ఇన్‌చార్జిలుగా నియమించారు. వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఎక్కువ మంది ఇన్‌చార్జిలను నియమించారు.

సమ్మక్క, సారలమ్మ దర్శనం నిలిపివేత

- సమస్యలు పరిష్కరించలేదని పూజారుల తీర్మానం

తాడ్వాయి, మే 19: తమ సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 29, 30 తేదీల్లో మేడారంలో అమ్మవార్ల దర్శనం నిలిపివేస్తున్నట్టు సమ్మక్క, సారలమ్మ పూజారులు తెలిపారు. ఆదివారం అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో పూజారులు, వాటాదారులు సమావేశం నిర్వహించారు. వరంగల్‌లోని మేడారం సమ్మక్క, సారలమ్మ కార్యాలయాన్ని ఖాళీ చేయించి తమ ఆధీనంలోకి తీసుకునేందుకు భద్రకాళి దేవస్థాన పూజారులు మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా దేవాదాయ శాఖ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. 1972లో అప్పటి మంత్రి పోరిక జగన్నాయక్ మేడారం జాతర కార్యాలయం కోసం వరంగల్‌లో స్థలాన్ని కేటాయించారని, నిధులు సమకూరక భద్రాకాళి, మెట్టుగుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయాల నుంచి 2 కోట్లు సేకరించి నగర నడిబొడ్డున ఆఫీసు నిర్మించారని గుర్తుచేశారు. ఈ భవనంలోనే అన్ని దేవాదాయ శాఖ కార్యాలయాలు కొనసాగుతున్నప్పటికీ.. మేడారం కార్యాలయాన్ని ఖాళీ చేయించి, వేద పాఠశాల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అమ్మవార్లకు కేటాయించిన స్థలంలోనే కార్యాలయాన్ని కొనసాగించాలని కోరారు. ఈ క్రమంలోనే రెండు రోజులు దర్శనం నిలిపివేస్తామని, అధికారులు స్పందించకుంటే జూన్ మొదటి వారంలో వరంగల్‌లో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

స్టేట్ రోడ్ల అభివృద్ధికి మోక్షమెప్పుడో?

- కాగితాలకే పరిమితమైన జాతీయ రహదారులు
- రోడ్లపై రాజకీయం చేస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారు

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అత్యంత ప్రధానమైన 14 స్టేట్ రోడ్లను నాలుగు లేన్ల జాతీయ రహదారులుగా తీర్చిదిద్దాలన్న ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. తెలంగాణలో పెరిగిన ప్రజా వసరాలను దృష్టిలో పెట్టుకొని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ రోడ్లను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించింది. వీటిలో జిల్లా కేంద్రాలు, పారిశ్రామికవాడలు, పర్యాటక ప్రాంతాలు, ప్రధాన ఆలయాలు, అంతర్రాష్ట్ర రహదారులను కలిపే రోడ్లు ఉన్నాయి. కానీ, వాటిని మంజూరు చేయకుండా తెలంగాణ పట్ల మోదీ సర్కారు వివక్ష ప్రదర్శించింది. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ఈ రోడ్ల అభివృద్ధి కోసం కేంద్రానికి మరోసారి ప్రతిపాదనలు సమర్పించి చేతులు దులిపేసుకున్నది. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో దశలవారీగా ఈ రోడ్లను అభివృద్ధి చేసే అవకాశం ఉన్నప్పటికీ రేవంత్‌రెడ్డి సర్కారు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్లను సైతం రద్దుచేసి రాజకీయాలు చేస్తున్నది. స్వరాష్ట్రం ఏర్పాటు తరువాత తెలంగాణ సమగ్రాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించిన కేసీఆర్ ప్రభుత్వం.. రహదారుల అభివృద్ధికి విస్తృత చర్యలు చేపట్టింది. అందులో భాగంగా అనేక గ్రామీణ రోడ్లను రాష్ట్ర రహదారులుగా అభివృద్ధి చేసింది. సింగిల్ లేన్ రోడ్లను రెండు లేన్లుగా, మెటల్ రోడ్లను డాంబర్ రోడ్లుగా మార్చింది. ఈ క్రమంలో అత్యంత ప్రధానమైన 14 రాష్ట్ర రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయాలని కేంద్రానికి ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలను ఆమోదించాలని మోదీ సర్కారుకు పలు వినతిపత్రాలను సమర్పించడమే కాకుండా కేసీఆర్ స్వయంగా కేంద్ర మంత్రితో మాట్లాడినా ఫలితం లేకపోయింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే ఈ రోడ్లను అభివృద్ధి చేయాలని గత కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఈ 14 రోడ్ల అభివృద్ధి అటకెక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వారం రోజుల్లోనే ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి ఈ 14 రోడ్ల అభివృద్ధి కోసం వినతిపత్రం ఇచ్చినప్పటికీ ఆయన నుంచి ఎలాంటి హామీ లభించలేదు.

జాతీయ రహదారులుగా మార్చాలని ప్రతిపాదించిన రోడ్లు

రోడ్డు	పొడవు (కి.మీ.)
చౌటుప్పల్-ఆమన్‌గల్-షాద్‌నగర్-సంగారెడ్డి (ఎన్‌హెచ్-65)	185
కరీంనగర్-సిరిసిల్ల-కామారెడ్డి-ఎల్లారెడ్డి-పెట్లం (ఎన్‌హెచ్-161)	165
వనపర్తి-కొత్తకోట-గద్వాల-మంత్రాలయం (ఎన్‌హెచ్-167)	110
ఎర్రవల్లి (ఎన్‌హెచ్-44-గద్వాల-రాయ్‌చూర్ (ఎన్‌హెచ్-167)	67
మన్నెగూడ-వికారాబాద్-తాండూర్-జహీరాబాద్-బీదర్ (ఎన్‌హెచ్-50)	133.9
మరికల్-నారాయణపేట్-రాంసముద్ర (ఎన్‌హెచ్-150)	63
జగిత్యాల-పెద్దపల్లి-రామప్ప టెంపుల్-జంగలపల్లి (ఎన్‌హెచ్-163)	164
సారపాక-ఏలూరునాగారం (ఎన్‌హెచ్-163)	93
పుల్లూర్-అలంపూర్-కొల్లాపూర్-మల్లంపల్లి-నల్లగొండ (ఎన్‌హెచ్-565)	225.1
దుద్దెడ-కొమ్రవెల్లి-యాదగిరిగుట్ట-రాయగిరి క్రాస్‌రోడ్ (ఎన్‌హెచ్-163)	63
జగ్గయ్యపేట-వైరా-కొత్తగూడెం (ఎన్‌హెచ్30)	100
సిరిసిల్ల-వేములవాడ-కోరుట్ల (ఎన్‌హెచ్-365బీ)	65
భూత్పూర్-నాగర్‌కర్నూల్-సిరిగిరిపాడు (ఎన్‌హెచ్ 565)	165.5
కరీంనగర్ (ఎన్‌హెచ్-563)-రాయపట్నం (ఎన్‌హెచ్-63)	60
మొత్తం	1,656.5

చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం

రాష్ట్రంలోని రోడ్ల అభివృద్ధికి ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో కేటాయించాల్సిన నిధులపై చర్చించేందుకు ఫిబ్రవరిలో ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించినప్పటికీ ఈ 14 రోడ్ల అంశం కనీసం ప్రస్తావనకు కూడా రాలేదు. మొత్తం 1,656 కి.మీ. పొడవైన ఈ రోడ్లకు బడ్జెట్‌లో కొంతైనా నిధులు కేటాయిస్తే దశలవారీగానైనా వాటిని అభివృద్ధి చేసేందుకు వీలుండేది. కానీ, ఎంతో ప్రధానమైన ఈ రోడ్లను రేవంత్ సర్కారు పూర్తిగా గాలికి వదిలేసింది. వాటి అభివృద్ధి కోసం కేంద్రానికి మరోసారి ప్రతిపాదనలు సమర్పించి చేతులెత్తేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం కనికరించే వరకు ఈ రోడ్ల అభివృద్ధికి మోక్షం లభించే అవకాశం కనిపించడం లేదు.

మేయర్ కిడ్నాప్‌నకు యత్నం!

మొదటిపేజీ తరువాయి...

ఉన్నారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను హస్తగతం చేసుకునేందుకు కాంగ్రెస్ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నది. ఇప్పటికే నాగారం, తూంకుంట మున్సిపాలిటీలు, జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో అవిశ్వాస సమావేశం నిర్వహిస్తే రెండు చోట్లా కాంగ్రెస్ ఘోరంగా విఫలమైంది. ఒక్క జవహర్‌నగర్‌లోనే నెగ్గింది. తాజాగా బోడుప్పల్ మేయర్‌పై అవిశ్వాసానికి కలెక్టర్‌కు నోటీసిచ్చారు. పీర్జాదిగూడలో బీఆర్ఎస్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిని కుర్చీ దింపేందుకు కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు చేస్తున్నది. ఓ దశలో ఆయన హత్యకు కూడా భారీగా స్కెచ్ వేసింది. వీటన్నింటిని ప్రజాస్వామ్య పద్ధతిలో తిప్పి కొట్టేందుకు నిర్ణయించుకున్న మేయర్ వెంకట్‌రెడ్డి ఈ నెల 6న తానే అవిశ్వాసం పెట్టేందుకు కలెక్టర్‌ను కలిశారు. వచ్చే నెల 5న అవిశ్వాస సమావేశం పెట్టాలని కలెక్టర్ శనివారం నిర్ణయించారు. ఎలాగైనా అవిశ్వాసం పెట్టకూడదని కలెక్టర్‌పై కాంగ్రెస్ వర్గీయులు ఒత్తిడి పెంచారు. సీఎం క్యాంపు కార్యాలయం కనుసైగల్లో ఇదంతా జరిగినట్టు సమాచారం.

క్యాంపునకు వెళ్తుండగా కిడ్నాప్ యత్నం

మేయర్, కార్పొరేటర్లు క్యాంపునకు వెళ్లేందుకు సూర్యాపేట నుంచి వస్తూ హయత్‌నగర్ వద్ద రింగురోడ్డు ఎక్కారు. అక్కడ 50 మంది వరకు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అనుచరులు, గూండాలు 20 కార్లలో వేచి ఉన్నారు. మేయర్, కార్పొరేటర్ల కారు రింగు రోడ్డు ఎక్కగానే వారిని ఆ 20 కార్లు వెంబడించాయి. వారి కార్లను ఢీకొట్టేందుకు ప్రయత్నించారు. కార్లను అడ్డుగా తీసుకొచ్చి, దాడి, కిడ్నాప్‌కు పాల్పడేలా భయాందోళనకు గురిచేశారు. మేయర్, కార్పొరేటర్లు తమ వాహనాన్ని తాము వెళ్లాల్సిన చోటుకుకాకుండా రింగు రోడ్డు మీదుగా ప్రయాణించారు. వెంట వస్తున్న వాహన శ్రేణితో భయభ్రాంతులకు గురవుతూ గంటపాటు బిక్కచచ్చిపోయారు. మీడియా, పోలీసులు, అనుచరులకు సమాచారం ఇచ్చారు. ఘటకేసర్ వద్ద రింగు రోడ్డు దిగుతున్నామని, అక్కడికి రావాలని కోరారు. పోలీసుల నుంచి స్పందన రాలేదని తెలిసింది. రింగురోడ్డుపై ఒక రౌండ్ పూర్తిగా ప్రయాణించి, తిరిగి ఘట్‌కేసర్ వద్ద రింగు రోడ్డు దిగి, పీర్జాదిగూడకు చేరుకున్నారు. మీడియాకు సమాచారం వెళ్లిందని తెలియడంతోనే సుధీర్‌రెడ్డి అనుచరులు వెనక్కి తగ్గినట్టు సమాచారం.

కాంగ్రెస్ గూండాయిజం

మేయర్ పీఠాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్ గూండాయిజానికి పాల్పడుతున్నదని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ఆగ్రహ వ్యక్తంచేశారు. పీర్జాదిగూడకు చేరుకున్న అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మేయర్ పీఠం కావాలంటే కార్పొరేటర్ల మద్దతు కావాలి కానీ, గూండాలు అవసరం లేదని చెప్పారు. రింగురోడ్డుపై తాము తీవ్ర భయాందోళనకు గురయ్యామని చెప్పారు. వారు తమ వాహనాలను ఛేజ్ చేస్తూ ఢీకొట్టే విధంగా, దాడిచేసి, కిడ్నాప్ చేసేలా భయభ్రాంతులకు గురిచేశారని విమర్శించారు. సుధీర్‌రెడ్డికి, ప్రభుత్వానికి ఇది మంచిది కాదని హితవుపలికారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ అహర్నిశలు శ్రమించి, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ఉన్నతంగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు.

కాంగ్రెస్ దాడి గర్హనీయం: హరీశ్‌రావు

పీర్జాదిగూడ మేయర్, కార్పొరేటర్లను కాంగ్రెస్ నేతలు భయభ్రాంతులకు గురిచేయడాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా తీవ్రంగా ఖండించారు. 'పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎలాగైనా సరే అవిశ్వాస తీర్మానం నెగ్గాలని కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లను కిడ్నాప్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఔటర్ రింగురోడ్డుపై 20 కార్లతో వారిని వెంబడి